నేడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం..

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని శ్రీ గోదాస మేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం క్రోధినామ ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ పద్మావతీ దేవి గోదాదేవి వేంకటేశ్వరస్వామికి ఆలయ ప్రాంగణంలోని విజయ వినాయక స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి, కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి, అయ్యప్ప స్వామివారికి ఉదయం 5 గంటలకు ఉగాది విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 నుంచి ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ కాకునూరి సూర్యనారాయణమూర్తి క్రోధినామ ఉగాది పంచాంగం శ్రవణం నిర్వహిస్తారన్నారు.

సాయిబాబా ఆలయంలో..

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో మంగళవారం ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 10 గంటలకు బ్రహ్మశ్రీ దరూరి మురళీధరాచార్యులతో క్రోధినామ సంవత్సర పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు సాయిబాబా సచ్చరిత్ర పారాయణం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని చైర్మన్ కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్‌లోని గౌతమినగర్‌లోని ప్రధానరోడ్డు పక్కన శాంతినికేతన్ మానసిక వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక వికలాంగుల సంస్థ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ కార్యదర్శి ఎల్. బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

సందడిగా ఉగాది, రంజాన్ వేడుకలు



ఉగాది, రంజాన్ పర్వదిన వేడుకల్లో చిన్నారులు

చంపాపేట: చంపాపేట డివిజన్ రెడ్డి బస్తీ కాలనీలోని రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలలో సోమవారం ఉగాది, రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు హాజరై సందడి చేయటంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు ఆంగ్లభాషలో ఉగాది, రంజాన్ పండుగ విశిష్టత, ఉపవాస దీక్ష ప్రాముఖ్యతను వివరించిన తీరు ఆహుతులను ఆకర్షింపజేశాయి. రవీంద్రభారతి విద్యాసంస్థల డైరెక్టర్ రేవంత్, అకడమిక్ డైరెక్టర్ రాణి, జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఓజీఎం చంద్రశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంగా చేయడం అభినందనీయం

అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న అనితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీవైద్యనాథ దేవాలయంలో గోల్డెన్ వాకర్స్‌టీం ఆర్యవైశ్య గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దడంతో నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని దేవాలయ ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌లను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, భార్గవ్‌రాజ్‌గౌడ్, అరుణ, రోజా, గోల్డెన్ వాకర్స్‌టీం సభ్యులు నగేష్‌గుప్తా, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కే.ఎస్.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా ప్రదీప్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ యువమోర్చా అధ్యక్షుడిగా కుతాడి ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ నియామక పత్రం ప్రదీప్‌కు అందజేశారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవికి ఎంపిక చేసిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, బుచ్చిరాములు, యాదగిరి యాదవ్, బెల్లంకొండ నాగరాజు, కార్పొరేటర్లు హరినాథ్‌రెడ్డి, భీంరాజ్ పాల్గొన్నారు.



షడ్రుచుల సమ్మేళనం ఉగాది

మొదలైన మార్కెట్ల సందడి, పెరిగిన కొనుగోళ్లు ● ఆలయాల్లో నేడు సాయంత్రం పంచాంగ శ్రవణం



సరూర్‌నగర్ రైతుబజార్‌లో పూలు కొనుగోలు చేస్తున్న స్థానికులు



కుండలను కొనుగోలు చేస్తున్న స్థానికులు



వినియోగదారులతో మార్కెట్లో సందడి

దిల్‌సుఖ్‌నగర్: చైత్ర శుద్ధ పాడ్యమినాడు తెలుగు వారంతా తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే మొట్ట మొదటి పండగ ఉగాది. ఈ ఏడాది అందరినీ ఆనందంగా పలకరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని మలక్‌పేట్ జోన్ పరిధిలో ప్రజలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఉగాది రోజున కొత్త పనులకు శ్రీకారం చుడితే విజయవంతమవుతాయనే నానుడి.
- ఈరోజు నుంచే వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. షడ్రుచులు మిలితమై అందరి జీవితాల్లో సంవత్సరం పొడువునా సఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం ఉగాది పండుగ ఆనవాయితీ.
- ఉదయాన్నే తలంటు స్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి ఇంట్లో పూజ కార్యక్రమాల అనంతరం సమీపంలోని దేవాలయాలకు వెళ్లి తమ ఇష్ట దైవాన్ని కొలుస్తారు.
- ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జోన్ పరిధిలోని మలక్‌పేట్‌జోన్‌లోని వివిధ డివిజన్లు, కాలనీల్లోని ప్రజలు కుటుంబ సమేతంగా పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. అన్ని చౌరస్తాల్లో కొత్త మట్టి కుండలు, పూల రాశులతో, మామిడి, వేప ఆకులు, పూత, మామిడికాయల రాశులు అమ్మకాలకు సిద్ధమై పండుగ కళను తెచ్చిపెట్టాయి.

ఉగాది పచ్చడికి ప్రథమ స్థానం ..

షడ్రుచులతో ఉగాది పచ్చడిప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తుంది. కొత్త చిత్తపండు, కొత్త బెల్లం, మామిడి పిందెల ముక్కలు, వేప పువ్వుతో చేసిన పచ్చడి ప్రతి ఇంటా పూజానంతరం ఆరగిస్తారు. షడ్రుచులతో తయారైన ఈ పచ్చడి ఆయుర్వేద ఔషధ గుణాలను కలిగి ఉంటుంది.

ఆలయాల ముస్తాబు..

- దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, మలక్‌పేట్, సరూర్‌నగర్, అక్బర్‌బాగ్, సైదాబాద్, ఓల్డ్ మలక్‌పేట్, ఐఎస్‌సదన్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజల కోసం ఆలయాలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆకాశన్నంటిన పూలు, పండ్లధరలు..

ఉగాది పండుగ సందర్భంగా వ్యాపారస్తులు పూలు, పండ్ల ధరలను అమాంతం పెంచారు. మామూలు రోజుల్లో ఉండే ధరలకు 4 రెట్లు అధికంగా అమ్ముతున్నారు. మామిడికాయ ఒక్కింటికి రూ. 15 నుంచి 25గా అమ్ముతున్నారు. సాధారణ రోజుల్లో రూ. 80 లోపు ఉండే బంతిపూలు ప్రస్తుతం కిలో రూ. 120–140, వేపపూత రూ.10 నుంచి రూ.20 రూపాయల వరకు అమ్ముతున్నారు. మట్టి కుండలు రూ.100 నుంచి రూ.300 వరకు ఈ ధర పలుకుతున్నాయి. పలు ప్రాంతాల్లో మట్టికుండలకు గిరాకీ బాగా పెరిగింది.

ఆలయాల్లో పంచాగ శ్రవణానికి ఏర్పాట్లు పూర్తి..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జోన్ పరిధిలోని ఆర్‌కేపురం అష్టలక్ష్మి అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, హరిహరక్షేత్రం, సరూర్‌నగర్‌లోని రామాలయం, శివాలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి దేవాలయం, సైదాబాద్, ఐఎస్‌సదన్, మాదన్నపేట్, అక్బర్‌బాగ్, తదితర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

బ్రహ్మ దేవుణ్ణి పూజించే ఏకైక పండుగ..

బ్రహ్మదేవుడు చైత్ర శుద్ధపాడ్యమినాడు ప్రపంచ సృష్టిని ప్రారంభించాడని, అందువల్ల దీనిని 'యుగాది(ఉగాది)' అంటున్నాం. ఉగాది రోజున ప్రొద్దునే ఇల్లును శుభ్రం చేసుకుని, అందంగా ముగ్గులు తీర్చిదిద్ది మామిడి తోరణాలతో ఇంటిని అలంకరించి, నూతన వస్త్రాలు ధరించి వసంతలక్ష్మికి స్వాగతం పలుకుతారు. వనవాసం పూర్తి చేసుకుని శ్రీరాముడు, సీతాలక్ష్మణ సమేతంగా అయోధ్యకు ఉగాది రోజున తిరిగివచ్చాడట. బ్రహ్మ దేవుణ్ణి పూజించే ఏకైక పండుగ ఉగాది.

'కాంగ్రెస్ గ్యారంటీలు పక్కా అమలు'



ఎన్నికల ప్రచారంలో మధుయాష్కీగౌడ్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ ఇచ్చిందంటే పక్కా అమలు చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డితో కలిసి సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్, వనస్థలిపురం డివిజన్ల పరిధిలో ఆయన మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ముచ్చటించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను విస్మరించిందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ ప్రకటించిన 'ఐదు న్యాయ' గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. పట్నం సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సమస్యలు తనకు తెలుసునని, తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు నాగోల్ జిల్లా పరిషత్ పాఠశాల, ఇతర మౌళిక సదుపాయాలకు నిధులు ఇచ్చానన్నారు. తనను గెలిపిస్తే ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహాయాదవ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సామ రమణారెడ్డి, ఈశ్వరమ్మ యాదవ్, శాలిని, రామారావు, వేణు, శ్రీనివాస్‌గౌడ్, వేములయ్యగౌడ్, స్వర్ణమాధవి, ఉమేష్‌గౌడ్, రవీందర్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఆదివారం రాత్రి కాలనీలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శరత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అశోక్‌కుమార్, పెరుమాండ్లు, సంజీవరెడ్డి, కోటిరెడ్డి, కార్యదర్శిగా అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా భీమయ్య, నాగేశ్వర్‌రావు, లవకుశరెడ్డి, యాదిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రామచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, కోశాధికారిగా కృపాకర్, సలహాదారులుగా అమర్‌నాథ్, జీవీరావు, ఆర్. నర్సారెడ్డి, భాస్కర్ రావుతో పాటు 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలో టమాటా రూ.17, వంకాయ రూ.18, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, కాకరకాయ 35, బీరకాయ 40, క్యాలీఫ్లవర్ 20, క్యాబేజీ 21, క్యారెట్ 25, దొండకాయ 18, ఆలుగడ్డ 35, ఉల్లిగడ్డ 22, గోకరకాయ 28, దోసకాయ రూ.17గా ఉన్నాయి.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని యువజన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని యాదవనగర్‌లోని శ్రీకృష్ణ దేవాలయం వద్ద అమావాస్య సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో అన్నదానం, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య మహిళ కార్మికులకు ఉగాది సందర్భంగా చీరలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యలు ఎక్కడ ఉన్నా.. సేవ గుణంతో ఉంటారన్నారు. ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేషం గుప్తా, శ్రీకృష్ణ దేవాలయం చైర్మన్ యాదగిరిరెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ప్రొద్దటూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిలు మాడిశెట్టి నాగేంద్రయ్య గుప్తా, శ్రావణ్‌కుమార్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పల బాలశ్యామ్, ఎన్టీఆర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



సమావేశంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ సభ్యులు

చంపాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కొమరం భీం, సంత్ సేవాలాల్ లంబాడా, ఏకలవ్య స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం హర్షణీయమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాయ్ ఉషాకిరణ్ అన్నారు. సోమవారం చంపాపేటలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లాస్థాయి ఫెడరేషన్ కన్వీనర్లు, కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు త్వరలో నాగర్ కర్నూల్‌జిల్లా కేంద్రంలో కృతజ్ఞతా సభను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఫెడరేషన్ సభ్యులు వాసం రామకృష్ణ, కొర్ర వంశీనాయక్, నాగమణి, బల్మూరి వెంకటేష్ తదితరులున్నారు.

తాగునీటి సరఫరాపై టోల్ ఫ్రీ నంబర్

బోడుప్పల్: వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై టోల్ ఫ్రీ నంబర్ 14420 ఏర్పాటు చేసినట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం వెల్లడించారు. బోడుప్పల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌ల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల అభివృద్ధి పనుల కారణంగా అక్కడక్కడ మంచినీటి పైపులైన్లు పగలడం, లీకేజీల కారణంగా నీటి సరఫరాలో జాప్యం ఏర్పడుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం: కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

బోడుప్పల్: న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు మూల స్తంభాలుగా ఉన్న భారత రాజ్యాంగం మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం కాకుండా పరిరక్షించుకుందామని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ రక్షణ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం బోడుప్పల్ బొమ్మక్ బాలయ్య ఫంక్షన్‌హాల్‌లో 'రాజ్యాంగ రక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ మన రాజ్యాంగం అధికారులు, పాలకుల పరిమితులను తెలియజేస్తుందని, ఇష్టారాజ్యంగా కాకుండా పరిమితులకు లోబడి చట్టాలు చేయాలన్నారు. సమాజంలో అసమానతలు తొలగిపోవాలని, అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతోందని పేర్కొన్నారు. జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ రాజ్యాంగ వ్యతిరేక ప్రభుత్వం వస్తే తిరగబడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఓబీసీ అని చెప్పుకుంటారేగానీ, ఓబీసీ కులగణన మాత్రం చేయరని, వారికి రిజర్వేషన్లు కల్పించరని అన్నారు.

మైనర్ బాలిక పట్ల దురుసు ప్రవర్తన..


నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి కోర్టులు: తండ్రిపై దాడి చేస్తుండగా.. అడ్డుకున్నందుకు ఓ మైనర్ బాలిక పట్ల దురుసుగా ప్రవర్తించిన నిందితుడికి పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పద్మావతి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ సునీతా బర్ల తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం గున్‌గల్ గ్రామానికి చెందిన బాధితురాలి కుటుంబం 2019 జూన్ 21న మహేశ్వరంలో తమ బంధువుల వివాహ శుభకార్యానికి వెళ్లారు. సమీప బంధువైన నిందితుడు యెద్దుల మహేశ్ (28) బాలిక తండ్రితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో గమనించిన బాలిక(14) తన తండ్రితో గొడవ విషయమై యువకున్ని ప్రశ్నించింది. దీంతో అతడు బాలికను అందరి ముందు అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా బాలిక పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మహేశ్వరం పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. బాధితురాలికి రూ. లక్ష నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా మృత్యుంజయ హోమం

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం సనాతన ధర్మ ప్రవర్తక సమితి ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. హోమంలో సాంబశివశర్మ, వంశీకృష్ణ, పార్థసారథి, వెంకట కృష్ణారావు, బాపిరాజు, గంగారామ కృష్ణ, లక్ష్మణరావు, శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో సబితారెడ్డి



చిన్నారులకు పండ్లను తినిపిస్తున్న సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలో సవూద్ పటేల్, సైఫ్ పటేల్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మజీద్‌లో ముస్లింలకు పండ్లను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆమె ముస్లింలకు ముందస్తుగా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, షేక్ అఫ్జల్, యంజాల జనార్ధన్, అర్జున్, అబ్బాస్, ఇద్రీస్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నాగోలు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 216 బీర్ సీసాలు, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, శాంతినగర్ కాలనీ చెందిన భూక్య రమేష్ సోమవారం రాత్రి కారులో నాగోలులోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా అక్రమంగా మద్యం తలిస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు రమేష్‌ను అందుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.35,100 విలువైన బీరు బాటిళ్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.